జూన్ 24, 2019

# ప్రచురణార్థం

---------

## పాలకులం కాదు.. సేవకులం

అమరావతిః అధికారం చేపట్టాక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి  సోమవారం జిల్లా కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులతో ప్రజావేదిక హాలులో ప్రత్యేకంగా కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ తన పాలన ఎలా ఉండాలో.. ఎలా ఉండబోతోందో.. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సూటిగా, మొహమాటాల్లేకుండా కుండబద్ధలు కొట్టినట్టు చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ జగన్ ప్రసంగంలోని ముఖ్యాంశాలుః

----------------------------------

– ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం పనిచేయాలి. మనం పాలకులం కాదు, ప్రజలకు సేవకులం..

– రాజ్యాంగం, చట్టం, న్యాయం అన్న విషయాలమీద మీకు పూర్తిగా శిక్షణ ఇస్తారు, మీరు కూడా వాటిపై గట్టి పట్టు సాధిస్తారు.

– మేనిఫెస్టో 2 పేజీల్లో క్లుప్తంగా ఇచ్చాం: నవరత్నాల ప్రతులు ప్రతి కలెక్టర్, హెచ్ఓడీ, కార్యదర్శులు, మంత్రుల వద్ద విధిగా ఉండాలి: ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలకు ఉన్న అర్థాన్ని, విలువను రాజకీయ పార్టీలు మార్చేశాయి: ఈ

విధానాన్ని మనం మార్చాలి.
– మేనిఫెస్టో భగవద్గీత, ఖురాన్, బైబిల్ కావాలి: మేనిఫెస్టోను అమలు చేస్తామని ప్రజలు ఈ ప్రభుత్వానికి ఓట్లు వేశారు: మన ప్రభుత్వం అంటే... ఆ ప్రభుత్వంలో మీరు అందరు కూడా భాగస్వాములే: నాకు అధికారం ఇచ్చారంటే.. అది మీ అందరికీ కూడా నా ద్వారా అధికారం ఇచ్చారు:ఈ ప్రభుత్వం అందరిదీ:అందరూ కలిసి కట్టుగా ఒక్కటైతేనే ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోగలుగుతాం: ప్రజల ఆకాంక్షలకు దగ్గర కాగలుగుతాం.

– రాష్ట్ర చరిత్రలో జరగని విధంగా 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించారు: 25 ఎంపీల్లో 22 సీట్లు ఇచ్చారు: 50శాతానికిపైగా ఓట్లేశారు: ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంత గొప్ప విజయం ఎప్పుడూ రాలేదు: మనం దీన్ని మరిచిపోకూడదు: ప్రజలు మనపై నమ్మకం, విశ్వాసం ఉంచారు: మేనిఫెస్టోలో ప్రతి అంశం మనం పూర్తిచేయాలి: రేపటి ఎన్నికల్లో మళ్లీ మనం ఇదే మేనిఫెస్టో చూపించి.. ఇవన్నీ చేశామని చెప్తాం: అందుకే మీ సహకారం చాలా కీలకం:

**చిరునవ్వుతో స్వాగతించండి..**
– ప్రజాస్వామ్యంలో మనం ఉన్నామన్నది ప్రతి ఒక్క అధికారీ గుర్తుంచుకోవాలి: 2 లక్షలమంది ప్రజలు ఓట్లేసి ఎమ్మెల్యేని ఎన్నుకుంటారు: మనం ఎప్పుడూ కూడా ఎమ్మెల్యేలను గుర్తుంచుకోవాలి:మీ దగ్గరకు వచ్చినప్పుడు చిరునవ్వుతో స్వాగతించిండి: ప్రజలు మీ దగ్గరకు వచ్చినప్పుడు నవ్వుతూ స్వాగతించండి: ఎమ్మెల్యేలను విశ్వాసంలోకి తీసుకోవాలి:

**అక్రమాలు, దోపిడీలు, అరాచకాలు, లూటీలను సహించం..**
**ఎమ్మెల్యేలు.. అధికారులు రెండు కళ్ళలా పనిచేయాలి..**
– అక్రమాలు, దోపిడీలు, అరాచకాలు, లూటీలను ఈ ప్రభుత్వం

సమర్థించదు:ఎంతటి పెద్దవాళ్లు అయినా సరే, ఏస్థాయిలో ఉన్న వ్యక్తైనా, మంచి జరుగుతుంది: ఎమ్మెల్యేలు ప్రజల నుంచి వినతిపత్రాలు తెస్తారు, ఫలానా పనిచేస్తే మంచి జరుగుతుందని చెప్తారు: దాన్ని పాజిటివ్‌గా తీసుకోవాలి: దీన్ని అధికారులు గుర్తుంచుకోవాలని ప్రార్థిస్తున్నా:

**ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, రైతుల్ని మరవద్దు.. వారి ఆత్మగౌరవం పెరగాలి..**

**అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాల ఫలాలు అందాలి..**

**ఓటు వేసిన వారికే కాదు.. ఓటు వేయని వారికీ మంచి చేయాలి..**

**ఎన్నికలయ్యేవరకే రాజకీయాలు.. ఎన్నికలయ్యాక అందరూ మనవాళ్ళే.**

– పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, రైతులను మనం ఎప్పుడూ మరిచిపోకూడదు:వారి స్థితిగతులను మనం విస్మరించకూడదు: సంతృప్తికర స్థాయిలో ప్రతి అర్హుడికీ పథకాలు అందించాలి: అలా చేయకపోతే మనం తప్పు చేసినట్టే: దేవుడి దృష్టిలోనూ, ప్రజల దృష్టిలోనూ మనం తప్పు చేసినట్టే అని చెప్తున్నా: వ్యవస్థలో ఈవర్గాల ఆత్మగౌరవం పెరగాలి:ఆర్థికంగా అణగారిన వర్గాలు నిలబడాలి: మనం వేసే ప్రతి అడుగూ వారికి దగ్గర కావాలి:

– ఇందుకోసమే మనం నవరత్నాలను ప్రకటించాం:మేనిఫెస్టోలో మనం ప్రస్తావించిన ప్రతిదీ కూడా అణగారిన వర్గాలకోసమే:వారి బతుకులు బాగుపడాలనే మనం దీన్ని తీసుకొచ్చాం:నవరత్నాలు అమలు చేసేటప్పుడు కులం, మతం, ప్రాంతం, రాజకీయం, పార్టీలు ఇవేవీ చూడొద్దని స్పష్టంచేస్తున్నా: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి:ఫలానా వారికి ఇవ్వొద్దని అధికార పార్టీ ఎమ్మెల్యే చెప్పినా.. సరే పట్టించుకోవద్దు:మనకు ఓటు వేయని వారికి కూడా మంచి చేయాలి:అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ.. పథకాలు అందాలి:మనం చేసిన మంచిని చూసి.. మళ్లీ మనకు ఓటు వేయాలి:ఎన్నికలు అయ్యేదాకే రాజకీయాలు, ఎన్నికలు

**గ్రామవాలంటీర్ల వ్యవస్థలో అవినీతికి తావుండకూడదు..**

– ప్రభుత్వ యంత్రాంగంలో మార్పు తీసుకురావడానికి శాచురేషన్ విధానాన్ని తెస్తున్నాం. శాచురేషన్ అన్నది కేవలం నేమ్‌సేక్ కాదు:వాస్తవంగా దీన్ని అమలు చేయాలి:దీనికోసం గ్రామవాలంటీర్లు, గ్రామ సచివాలయాలను తీసుకు వస్తున్నాం:దీనిపట్ల మీకు అవగాహన ఉందని నమ్మతున్నా:ప్రతి 50 ఇళ్లకు గ్రామ వాలంటీర్‌ను తీసుకొస్తున్నా: ప్రతి 2వేలమంది నివాసం ఉన్నచోట గ్రామ సెక్రటేరియట్:ప్రతి ప్రభుత్వం పథకాన్ని డోర్ డెలివరీ చేస్తాం:ప్రతి లబ్ధిదారునికీ మంచి జరగాలనే ఈకార్యక్రమం చేపట్టాం: ఏ ఒక్కరికీ అందకుండా ఉండటానికి వీల్లేదు:గ్రామ వాలంటర్ వ్యవస్థలో ఎక్కడా అవినీతికి చోటు ఉండకూడదు. వివక్ష చూపకూడదు, తమ ఇష్టాఇష్టాలు చూపకూడదు:అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ గ్రామ వాలంటీర్ పథకాన్ని అందించాల్సిందే:అవినీతి చేయకూడదనే గ్రామ వాలంటీర్‌కు రూ.5వేలు ఇస్తున్నాం:ప్రతి పథకం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ చేరాలి:గ్రామ వాలంటీర్లు పొరపాటు చేస్తే చర్యలు తీసుకుంటాం:నేరుగా సీఎం కార్యాలయంలోనే కాల్‌సెంటర్ పెట్టాం:ఎక్కడ తప్పు జరిగినా వెంటనే విచారణచేసి చర్యలు తీసుకుంటాం:50 కుటుంబాల పరిధే కాబట్టి ఆరోపణలపై విచారణ నేరుగా జరుగుతుంది: ఎవ్వరు చెప్పినా సరే చర్యలు ఆగవు: ఇందులో ఎలాంటి మొహమాటం చూపకూడదు:

**మన ప్రతి అడుగులోనూ పారదర్శకత ఉండాలి.. దేశానికే మనం ఆదర్శం కావాలి..**

–ప్రభుత్వ యంత్రాంగం నిజాయితీగా పనిచేయాలి:గ్రామస్థాయి నుంచి పై స్థాయి వరకూ ఎక్కడా అవినీతి ఉండకూడదు:ప్రతి అడుగులోనూ పారదర్శకత కనిపించాలి:ప్రజలు దీన్ని ఆశించారు:చెడిపోయిన ఈవ్యవస్థ మారాలి అని చెప్పి ఎన్నికల్లో ప్రతి సభలో మాట్లాడా:సీఎం నుంచి కలెక్టర్‌వరకూ, కలెక్టర్ నుంచి గ్రామస్థాయి వరకూ వ్యవస్థలో మార్పు రావాలి:ప్రతి అడుగులోనూ పారదర్శకత ఉండాలి:దేశం మొత్తం మనవైపు చూసేలా ఈ మార్పు

రావాలి:మిగిలిన చోట్ల అమలు చేయడానికి మనం నమూనాగా ఉండాలి:

**ప్రజలకు హక్కుగా సేవలు అందాలి.. అవినీతికి నో చెప్పండి..**

– ప్రజలకు హక్కుగా సేవలు అందాలి:దానికోసం లంచాలు ఇవ్వకూడదు:ప్రజలు ఆఫీసులు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగకూడదు:మన ప్రభుత్వంలో, మనం అధికారంలో ఉండగా ప్రజలకు ఏం కావాలన్నా.. లంచాలు ఇస్తే తప్ప జరగని పరిస్థితి నుంచి బయటకు రావలి:పనులకోసం ఆఫీసులచుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు:మనం అంటే మీరు, నేను.. ఇద్దరం :మన పనితీరు ఆధారంగానే ప్రజలు మనకు ఓట్లేస్తారు:మన పనితీరు అంటే నా పనితీరు, మీ పనితీరు.. ఇదే ప్రమాణికం కావాలి:ఎవ్వరైనా, ఎంత పెద్దవాళ్లైనా... మీకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా అక్రమాలకు నో చెప్పండి, లూటీలకు నో చెప్పండి, ఇసుక మాఫియాకు నో చెప్పండి, పేకాట క్లబ్బులకు, గాంబ్లింగ్‌లకు నో చెప్పండి, అవినీతికి నో చెప్పండి:మీ అందరినీ వినయంగా అర్థిస్తున్నా:మనం పారదర్శకతతో పనిచేద్దాం:నా స్థాయి నుంచి నేను సంకేతాలు ఇస్తున్నా, మీ లెవల్ నుంచి మీరు కిందిస్థాయికి సంకేతాలు ఇవ్వండి:

**అవినీతి అంతానికి పై స్థాయి నుంచి ప్రక్షాళణ మొదలు పెట్టాం..**
**గత పాలనలో ఎక్కడ చూసినా లంచం.. లంచం..**

– 3648 కిలోమీటర్లు పాదయాత్ర చేశాను :గ్రామాల్లో ఏం జరుగుతుందో విన్నాను, నా కళ్లతో చూశాను:పెన్షన్ కావాలంటే.. మొట్టమొదట అడిగే మాట..మీరు ఏపార్టీకి ఓటు వేశారని:పెన్షన్ కావాలంటే.. నాకు ఎంత ఇస్తారని:డెత్ సర్టిఫికెట్‌కు, బర్త్ సర్టిఫికెట్‌కు, మట్టి, ఇసుక, చిన్న బీమాకు కూడా లంచం, పెద్ద బీమాకు లంచం, పనిముట్లు ఇవ్వడంలో కూడా లంచం:ట్రాక్టర్ల కొనుగోలులో లంచం, చివరికి బాత్‌రూమ్స్ శాంక్షన్ కావాలన్నా లంచాలు:గ్రామస్థాయి నుంచి ఇదే పరిస్థితి:పూర్తిగా మార్పు రావాలి:పైస్థాయిలో హెచ్ఓడీలు, కార్యదర్శులు... కాంట్రాక్టులు అంటేనే

అవినీతి అనే పరిస్థితికి తీసుకొచ్చారు: ఇరిగేషన్ వర్క్స్, రోడ్లు, సచివాలయ నిర్మాణం.. ప్రతి చోటా అవినీతి: దీన్ని మార్చడానికి పైస్థాయి నుంచి ప్రక్షాళణ మొదలు పెట్టాం:వ్యవస్థలో మార్పులకోసం ప్రయత్నాలు మొదలుపెట్టాం:దీనికోసం రివర్స్ టెండరింగ్ తెస్తున్నాం: అంటే రూ.100 పని రూ.80లకే అవుతుందని అనుకుంటే రివర్స్‌టెండరింగ్:తక్కువకు ఎవరు కోట్‌చేస్తారో వారికి పనులు అప్పగిస్తాం: ప్రీక్వాలిఫికేషన్ క్రైటీరియాను మార్చి.. ఎక్కువ మంది టెండర్లలో పాల్గొనేలా చేస్తాం:రూ.100ల పని రూ.75కే చేస్తారా అని అడుగుదాం: ఇందులో ఏ ఒక్క రూపాయి మిగిలినా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చేద్దాం:నాణ్యత, పారదర్శకత పాటిద్దాం:నా స్థాయిలో నేను, మీ స్థాయిలో మీరు నిర్ణయాలు తీసుకుంటే మార్పు వస్తుంది:జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని నేనే స్వయంగా హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను అడిగాం:రూ.100 కోట్ల పైచిలుకు హైవాల్యూ కాంట్రాక్ట్ పనులు నేరుగా జ్యుడిషియల్ కమిషన్‌కు వెళతాయి.:వారంరోజుల పాటు పబ్లిక్ డొమైన్‌లో టెండర్ ప్రతిపాదనలను జడ్జిగారు పెడతారు:దానిపై సలహాలు కూడా జడ్జిగారికి ఇవ్వొచ్చు:మనకు వ్యతిరేకులైనా సలహాలు ఇవ్వొచ్చు :జడ్జిగారు ఈ సలహాలు తీసుకుని , సాంకేతిక కమిటీ సహాయంతో ప్రభుత్వానికి మార్పులు సూచిస్తారు:సాంకేతిక కమిటీకి అయ్యే ఖర్చును మనమే భరిస్తాం:ఆతర్వాతే మనం టెండర్లు పిలుస్తాం :పారదర్శకతను ఆ స్థాయిలోకి తీసుకు వెళ్లాలి:

– మేనిఫెస్టోపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి:నాకు సన్నిహితులైన కొంతమంది సీనియర్ ఐఏఎస్ అధికారులతో చర్చించాను: ఏంచెప్తే బాగుంటుందని అడిగా:ఇవి చేయగలిగితే.. మనం మార్పులు సాధించగలం అని సూచించారు : నా తండ్రి మాదిరిగా చనిపోయిన తర్వాత కూడా నా ఫొటో ప్రతి ఇంట్లో ఉండాలని నేను తాపత్రయ పడుతున్నా:అలాగే మీ గురించి ప్రజలు మాట్లాడుకోవాలి:కొన్ని సలహాలు నేను మీకు ఇస్తాను, మీరు మీకున్న

పరిజ్ఞానంతో వాటిని మెరుగు పరచవచ్చు:

ఫ్రెండ్లీ పాలన ఉండాలి..
అధికారులు నవ్వుతూ ఆప్యాయంగా పలకరించాలి..
ప్రతి సోమవారం స్పందన.. గ్రీవెన్స్‌లో రసీదులు ఇవ్వాలి.. టైంబౌండ్ పెట్టాలి..
కలెక్టరేట్ నుంచి ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ గ్రీవెన్స్‌లు..
– పాదర్శకత, స్నేహపూర్వక పరిపాలన ఉండాలి:ఉదయం నుంచి, సాయంత్రం వరకూ మీరు నవ్వుతూ ఉండాలి:అది మీకు సహాయపడుతుంది:మీ దగ్గరకు ఎవరైనా వస్తే.... వారిని ఆప్యాయంగా పలకరించండి:నవరత్నాలు – మేనిఫెస్టో.. ప్రతి అర్హత ఉన్న కుటుంబానికి చేరాలి:మన పార్టీ అనో.. వేరొక పార్టీ అనో పట్టించుకోవద్దు:నాకు ఓటేశాడు, వేయలేదు.. వీటిని పట్టించుకోవద్దు:

–కలెక్టర్లు అందుబాటులో ఉండరని చెప్తుంటారు :ప్రతి సోమవారం స్పందన అని కార్యక్రమాన్ని చేపట్టండి:ప్రతి సోమవారం కేవలం కలెక్టరేట్‌లోనే కాదు, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ స్పందన కార్యక్రమం చేపట్టండి:ఆ సోమవారం రోజు ఎలాంటి రివ్యూ సమావేశాలూ చేపట్టొద్దు:సెక్రటరీలు, హెచ్ఓడీలకు కూడా ఇదే చెప్తాం:నవ్వుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టండి:గ్రీవెన్స్ తీసుకున్న తర్వాత రశీదు ఇవ్వండి, మొబైల్ నంబర్ తీసుకోండి:రశీదు తీసుకున్న తర్వాత టైంబౌండ్ పెట్టండి:మీ సమస్యను, నేను ఈ టైంలోగా పూర్తిచేస్తా అని అందులో పేర్కొనండి. ఇదే పద్ధతి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరగాలి:

గ్రామ సచివాలయాలు ఏర్పడ్డాక రచ్చబండకు శ్రీకారం..
నేను కూడా రాబోయే రోజుల్లో గ్రామ సచివాలయాలు వచ్చాక... రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తా:ఆ రశీదులను రాండమ్ గా చెక్ చేస్తా:మీ లెవల్లో మీరు కూడా రాండమ్ చెక్ చేయండి: నెలకోసారి కచ్చితంగా రాండమ్ చెక్

చేయండి:దీనివల్ల ఆ పని కచ్చితంగా చేయాలనే పరిస్థితి వస్తుంది. రశీదులు ఇచ్చి పట్టించుకోలేదనే పరిస్థితి రాకూడదు:

**మూడో శుక్రవారం మీతో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం కేటాయించండి..**
**వారానికోరోజు హాస్టల్స్, ప్రభుత్వాసుపత్రుల్లో ఐఏఎస్‌ల నిద్ర.. ఆకస్మిక తనిఖీలు**

– స్పందన కార్యక్రమానికి పూర్తి పబ్లిసిటీ ఇవ్వండి:అంగన్‌వాడీలు, హోంగార్డులు, ఇతర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వీళ్లే మన గురించి నెగెటివ్‌గా మాట్లాడితే.. ఇక ప్రజలు కూడా అలాగే మాట్లాడతారు:మన దగ్గర పనిచేస్తున్న ఉద్యోగులను సంతోషంగా ఉంచండి:లేకపోతే.. డెలివరీ నెట్‌వర్క్ పనిచేయదు:ప్రతి నెలలో మూడో శుక్రవారం దిగువస్థాయి ఉద్యోగులకోసం, మనతో పనిచేస్తున్న ఉద్యోగులకోసం కేటాయించండి:

– కలెక్టర్లు సహా... జిల్లాలోని ఐఏఎస్ అధికారులు ప్రతి వారంలో ఒకరోజు ప్రభుత్వ హాస్టల్స్‌లో, ప్రభుత్వాసుపత్రుల్లో నిద్రించండి: అందరు ఐఏఎస్ అధికారులను కోరుతున్నా :ఆకస్మిక పర్యటనలు చేయండి :అరగంట ముందు మీ టీంను పంపండి:ఐఏఎస్‌లే అక్కడకు వెళ్లి పడుకున్నప్పుడు... అక్కడ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయో తెలుస్తుంది:అక్కడ మరుగుదొడ్డిని వాడుతున్నప్పుడు.. అవి సరిగా ఉన్నాయో, లేదో మీకు తెలుస్తుంది:పిల్లలకు పుస్తకాలు సరిగా అందుతున్నాయా? లేదా? ఉపాధ్యాయులు సరిగ్గా బోధిస్తున్నారా లేదా? తెలుస్తుంది:మీరు సడన్‌గా వస్తున్నారని తెలిస్తే.. హాస్టళ్లు, పీహెచ్‌సీలు బాగుపడుతాయి:పొద్దుట లేచిన తర్వాత అక్కడే స్నానం చేయండి. ఆతర్వాత ఆగ్రామ ప్రజలతో సమావేశం అవ్వండి:ఉదయం 10 తర్వాత గ్రామాలకు వెళ్తే... ఎవ్వరూ ఉండరు. పొద్దుటే వెళ్తే.. ప్రజలు ఉంటారు. నవరత్నాలు ఎలా అమలు అవుతున్నాయో ఫీడ్ బ్యాక్ తీసుకోండి: హాస్టళ్ళు, ఆస్పత్రులు ఎలా ఉన్నాయో  అడగండి. మీరు ఇప్పుడున్న స్కూల్స్ ఫొటోలు తీయండి. రెండేళ్లలో వాటిని మారుస్తాం:ఆతర్వాత పాత ఫోటో.. కొత్త ఫోటో.. ఆ రెండు  ఫొటో గ్రాఫ్‌లు పోల్చి చూపించండి: విద్య, ఆరోగ్యం,

రైతులు నా ప్రధాన ఎజెండా:

**ఉగాది నాటికి ఇంటి స్థలం లేనివాళ్ళు ఎవరూ ఉండకూడదు..**

– ఈ ఉగాది నాటికి ఇంటి స్థలం లేని వాళ్లు రాష్ట్రంలో ఎవ్వరూ ఉండకూడదు:ఇంట్లోని అక్కచెల్లెమ్మల పేరుమీద రిజిస్ట్రేషన్ చేస్తాం :ప్రతి గ్రామంలో ఎంతమందికి లేవు? ఎంతమందికి ఇవ్వాలి? గుర్తించండి:అవసరమైతే దానికోసం భూములు కొనండి:ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే కొనుగోలు చేయండి:నేను చాలాచోట్ల గమనించా:నాకు అక్కడ ఇచ్చారు; ఇక్కడ ఇచ్చారు అని చెప్తున్నారు:కాని వారికి ప్లాట్లు ఎక్కడున్నాయో కరెక్టుగా తెలియదు:పట్టా ఉంటుంది కానీ, ప్లాటు ఎక్కడో కనిపించదు:మన సీఆర్డీయే పరిధిలోనే రైతులకు పట్టాలు ఇచ్చారు, కాని ఎక్కడ ప్లాటు ఉందో తెలియని పరిస్థితి: రాష్ట్రంలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ఉగాది రోజున ఒక పండుగ లాగ చేయాలి:విశ్వసనీయత అనేది చాలా ముఖ్యం:

**రూల్స్ అందరికీ ఒకేలా ఉండాలి.. విశ్వసనీయత పెంచాలి..**

– కలెక్టర్‌గారు చేస్తామన్నారంటే.. కచ్చితంగా అది అయిపోవాలి:కోల్డ్‌స్టోరేజీలో పెట్టే పరిస్థితి వద్దు :విశ్వసనీయతకు ప్రాధాన్యత ఇవ్వాలని పదేపదే అడుగుతున్నా:ఒక పాలసీ తీసున్నాక ఒక్కొక్కరి విషయంలో ఒక్కోలా రూల్స్ ఉండకూడదు:వివిధ రకాలుగా అమలు ఉండకూడదు:తర, తమ బేధం లేకుండా అందరికీ ఒకే విధానం ఉండాలి:డిస్ట్రిక్ పోర్టల్‌ను తీసుకు రావాలి:గ్రామస్థాయి  నుంచి మండల స్థాయి వరకూ, మండల స్థాయి నుంచి కలెక్టరేట్ వరకూ, జ్యుడిషియరీ, పోలీస్, ఎఫ్ఐఆర్ అన్నీ కూడా డిస్ట్రిక్ పోర్టల్‌లో ఉండాలి:రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతి ఆర్డర్‌కూడా పోర్టల్‌లో ఉంటుంది:అలాగే డిస్ట్రిక్ పోర్టల్ కూడా ఉండాలి:పని, విలువ, కాంట్రాక్టర్, ప్రారంభించిన తేదీ, పూర్తయ్యే తేదీ.. అన్నికూడా పోర్టల్‌లో ఉండాలి: అప్పుడే మనం పాదర్శకంగా ఉంటున్నామనే మెసేజ్ కిందిస్థాయికి వెళుతుంది:

– ప్రభుత్వ భూములపై ఆడిట్ చేయండి :చాలా విభాగాలకు సంబంధించిన భూమి వారి చేతిలో లేదు:కలెక్టర్లు న్యూట్రల్‌గా ఉంటారు, నిష్పక్షపాతంగా ఉంటారు కాబట్టి మీరు ఆడిట్ నిర్వహించండి:ఎంత భూమి అందుబాటులో ఉంది, దీన్ని ఎలా వాడుకోవాలన్నది తెలుతుంది:మీరు ఇన్నోవేటివ్ ఐడియాలతో రండి, సమాజానికి మేలు చేసేలా చర్యలు తీసుకుంటాం:మీరు ఆస్పత్రులకు, హాస్టళ్ల విజిట్‌కు వెళ్లినప్పుడు థర్డ్‌పార్టీనికూడా తీసుకెళ్లండి:ప్రభుత్వంలో ఇతర డిపార్ట్‌మెంట్‌ను థర్డ్‌పార్టీగా వినియోగించుకోండి:దీనివల్ల వాస్తవ పరిస్థితి మీకు తెలిసే అవకాశం కలుగుతుంది: దీనివల్ల తప్పులను సరిదిద్దే అవకాశం ఉంటుంది:లబ్ధిదారుల జాబితా పంచాయితీల స్థాయిలో తయారు కావాలి:దీనివల్ల పాదర్శకంగా ఉండే అవకాశం ఉంటుంది:జాబితాలో ఎవరు ఉండాలి, ఎవరు ఉండకూడదన్న దానిపై అవగాహన ఉంటుంది:వాలంటీర్లు మీకు కళ్లు, చెవులుగా ఉంటారు:గ్రామ సచివాలయం కూడా అక్కడే ఉంటుంది:మార్పు తీసుకు రావాలి:దీనికోసం తపన ఉండాలి:తపన లేకపోతే మార్పు రాదు:మీదైన ముద్ర ఉండాలి:జిల్లానుంచి మీరు బయటకు వచ్చేటప్పుడు ప్రజలు మీ గురించి  మంచిగా మాట్లాడుకోవాలి:

–గ్రామ వాలంటరీ డ్యూటీ డెలివరీతో నిలిపేయకూడదు:ఆ యాభై కుటుంబాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా గ్రామ సచివాలయం దృష్టికి తీసుకు రావాలి:ఆ సమస్యలను పరిష్కరించేలా చూడాలి:కేవలం వారు డెలివరీకి పరిమితం చేయకూడదు :గ్రామ వాలంటీర్లలో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, యాభై శాతం మహిళలకు అవకాశం :

**గ్రామ సచివాలయాల్లో 72 గంటల్లో లబ్ధిదారుల దరఖాస్తులు పరిష్కారం కావాలి..**

– గ్రామ సచివాలయంలో 10 మందిని ఫ్రెష్‌గా తీసుకోండి: దీనికోసం రిక్రూట్‌మెంట్ చేయండి:ప్రభుత్వ ఉద్యోగులను దీనికి అనుసంధానం చేయండి:గతంలో ఉద్యోగాలుకోల్పోయిన వారిని గ్రామ వాలంటీర్లుగా

అవకాశం ఇవ్వండి:సాక్షర భారత్‌లో పనిచేసి ఉద్యోగాలు కోల్పోయినవారినీ పరిశీలించండి:పెన్షన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా... ఇలా ఏది కావాలన్నా గ్రామ సచివాయంలో దరఖాస్తు చేస్తారు:72 గంటల్లోగా దాన్ని పరిష్కరించాలి: దీనికోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించండి:అగ్రికల్చర్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నవారికీ గ్రామ సచివాలయాల్లో అవకాశం ఇవ్వండి:దీనివల్ల నవరత్నాల్లో మనం పేర్కొన్న అంశాలపై ఫోకస్ ఉంటుంది:మేనిఫెస్టోలోని అంశాలను గ్రామ సచివాలయంలో ఉన్న సభ్యులకు అసైన్ చేయాలి:ప్రతి గ్రామ సచివాలయంలో ఒక ల్యాబ్‌ను పెట్టాలి:భూ పరీక్షలు, ఎరువులు, విత్తనాల పరీక్షలు.. ఇవన్నీ కూడా ఇందులో భాగం కావాలి:రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను గ్రామ సచివాలయాలద్వారా విక్రయిస్తాం:

**ప్రభుత్వాసుపత్రుల్లో ఎలుకలు కొరికి పిల్లలు చనిపోయే పరిస్థితి రాకూడదు..**
**ఆరోగ్యశ్రీ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి..**

– ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన సేవలు ఉండాలి:ఎలుకలు వచ్చి పిల్లలను కొరకడం, టార్చ్ లైట్లో ఆపరేషన్లు చేయడం లాంటివి ఉండకూడదు: సీఎంనెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలను వెంటనే తీర్చేయాలి:ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.450 కోట్లు ఉన్నాయి:9 నెలలనుంచి ఇవ్వడం లేదు :వెంటనే చెల్లించండి:లేకపోతే పేద రోగులు చాలా ఇబ్బంది పడతారు:శిశుమరణాలు, మాతృమరణాలను నివారించాలి: ఆస్పత్రుల్లో ఎక్కడ ఖాళీలు ఉన్నా వాటిని భర్తీచేయాలి అని కలెక్టర్లకు ఆదేశాలు:వాటిపై నివేదికలు తయారుచేసి వెంటనే పంపాలి:కుష్టువ్యాధి మళ్లీ కనిపిస్తోంది, నాకు పాదయాత్రలో కనిపించింది:కుష్టు వ్యాధి నివారణపై దృష్టిపెట్టాలి:మందులు, చికిత్స తదితర అంశాలపై సీరియస్‌గా దృష్టిపెట్టండి:అవసమైతే వారికి పెన్షన్ పెంచండి?: కొత్తగా కట్టిన ఆస్పత్రుల్లో పూర్తిస్థాయి పరికరాలు ఉన్నాయా? లేవా? చూడండి:ఎమ్మెల్యేలను ఆస్పత్రుల అభివృద్ధి కమిటీకి ఛైర్మన్‌గా నియమించండి:ఎమ్మెల్యేలు చెప్తున్న అంశాలను పరిగణలోకి

తీసుకోండి:వర్షాకాలం వస్తోంది కాబట్టి జ్వరాలు వస్తాయి, వెంటనే చర్యలకు ఉపక్రమించండి:ఏజెన్సీ ప్రాంతాల్లో రోగాలు రాకుండా చూసుకోండి:

**క్వాలిటీ బియ్యమే ప్రజలకు చేరాలి..**

– పౌరసరఫరాల శాఖ నుంచి ప్రజలు వాడే వస్తువులు ఇవ్వాలి: ఇప్పుడిస్తున్న బియ్యం నాణ్యత బాగోలేదు: అందుకనే గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన బియ్యాన్ని తిరిగి డీలర్‌కే అమ్మేసిన పరిస్థితులు చూశాం:తిరిగి అవే బియ్యం పాలిష్ చేసి, మళ్లీ ప్రజలదగ్గరకు వచ్చే పరిస్థితి:ప్రజలు వినియోగించే వాటినే మనం ఇవ్వాలి:ఒకవైపు రైతులకు గిట్టుబాటు ధర ఇస్తూ, మరోవైపు క్వాలిటీ బియ్యం ప్రజలకు చేరాలి:కలెక్టర్లు కీలకమైన పాత్ర పోషించాలి:గత ప్రభుత్వం రైతులకు రూ.1000 కోట్లు బకాయి పడింది:ఈ డబ్బులను ఎన్నికల స్కీంలకు మళ్లించారు:ఈ వేయికోట్లను రైతులకు చెల్లించాలి:

**తల్లులను ప్రోత్సహించేందుకే అమ్మ ఒడి..**

**ఏ పిల్లాడు ప్రైవేటు స్కూల్‌లో చేరాలన్న ఆలోచన రాకుండా ప్రభుత్వ స్కూళ్ళను మారుస్తాం..**

**విద్యారంగం సేవే కానీ.. వ్యాపారం కాకూడదు..**

–ఆంధ్రప్రదేశ్‌లో నిరక్షరాస్యత 33 శాతం ఉంది: జాతీయ స్థాయి సగటు కన్నా ఎక్కువ:అందుకే తల్లులను ప్రోత్సహించడానికి అమ్మ ఒడి పెట్టాం:విద్యా రంగం నాకు అత్యంత ప్రాధాన్యమైన అంశాలలో ఒకటి:స్కూల్స్ ఇప్పుడున్న పరిస్థితిపై ఫొటో గ్రాఫ్స్ తీసి, వాటిని అభివృద్ధి చేస్తాం:ఫ్యాన్లు, ఫర్నీచర్, ప్రహరీగోడ, బాత్‌రూమ్స్ అన్నింటినీ బాగుచేస్తాం:ప్రతి స్కూలును ఇంగ్లిషు మీడియం స్కూలుగా మారుస్తాం:తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తాం: యూనిఫారంలు, పుస్తకాలు సకాలనికే ఇస్తాం:పిల్లలకు షూలు కూడా ఇవ్వాలని ఆలోచన చేస్తాం:గత ప్రభుత్వం మాదిరిగా స్కూలు యూనిఫారాల్లో స్కాంలు జరగకూడదు:మధ్యాహ్న భోజనంలో నాణ్యతకూడా పెంచుతాం:ఇవన్నీ చేశాక ఏ పిల్లవాడు కూడా ప్రయివేటు స్కూలుకు పోవాలన్న ఆలోచన రాకూడదు:

– స్కూళ్ళల్లో ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణకు అసెంబ్లీలో చట్టం తీసుకొస్తాం:కేంద్ర ప్రభుత్వం చేసిన విద్యాహక్కు చట్టాన్ని నూటికి నూరుపాళ్లా అమలు చేస్తాం:ప్రయివేటు స్కూళ్లలో 25శాతం సీట్లు పేదలకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం:దేశంలో విద్య అనేది సేవేకాని, డబ్బు ఆర్జించే రంగం కాదు: ఎవరు విద్యాసంస్థలు పెట్టినా అది వ్యాపారం కాకూడదు, అది సేవ మాత్రమే:

– జనవరి 26 నుంచి అమ్మ ఒడి చెక్కుల పంపిణీ చేస్తాం:యూనిఫారం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తున్నాం:ఇందులో అవినీతి చాలా ఎక్కువగా ఉంది :ప్రయివేటు స్కూలుకు తప్పనిసరిగా గుర్తింపు ఉండాలి, కనీస ప్రమాణాలు, కనీస స్థాయిలో టీచర్లు కూడా ఉండాలి:నియమాలు, నిబంధనలు రూపొందించండి:ఎక్స్‌ప్షన్ ఏమైనా ఉంటే.. దానిపై నిర్ణయం కలెక్టర్ తీసుకోవాలి:విద్యా హక్కు చట్టం... రాజ్యాంగ బద్ధమైన హక్కు:ఇది ప్రజల హక్కు, కచ్చితంగా ప్రయివేటు స్కూళ్లలో అమలు చేయాలి:

------------

## అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రజావేదిక నుంచే మొదలు..

–ఇవాళ పరిస్థితులు ఒక్కసారి మనం గమనించాలి: ఏ స్థాయిలో వ్యవస్థ దిగజారిపోయిందో మనం చూడాలి:మనం ఇక్కడే(ప్రజావేదిక) సమావేశం అయ్యాం:ఈ సమావేశం జరుగుతున్న ఈహాల్లో ఇంతమంది కలెక్టర్లు, కార్యదర్శులు, హెచ్ఓడీలు, మంత్రులు, సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఇక్కడే కూర్చున్నారు: ఈ భవనం లీగల్‌గా, చట్టపరంగా సరైనదేనా?: అంటే కాదు. నిబంధనలకు విరుద్ధంగా, చట్టానికి వ్యతిరేకంగా, అవినీతితో కట్టిన భవనం ఇది: ఒక అక్రమ నిర్మాణంలో ఇంతమంది అధికారులు, మనం సమావేశం పెట్టుకుంటున్నాం: నది వరద మట్టం స్థాయి 24 మీటర్లు, కాని ఈ బిల్డింగ్ ప్రస్తుతం ఉన్న స్థాయి 19 మీటర్లు:కృష్ణా సెంట్రల్ డివిజన్ నుంచి ఎగ్జిక్యూటివ్

ఇంజినీర్ గత ప్రభుత్వానికి లేఖ ఇచ్చారు:గ్రీవెన్స్ హాలు ఇక్కడ కట్టొద్దని ఆయన చెప్పారు:నదీ పరిరక్షణ చట్టం పట్టించుకోలేదు:లోకాయుక్త సిఫార్సులు కూడా పట్టించుకోలేదు: చివరికి దీని నిర్మాణంలో కూడా అవినీతి :భవనం నిర్మాణ అంచనాలు కూడా రూ.5 కోట్ల నుంచి రూ. 8.9కు పెంచారు:ఇది చూపించడానికీ, మన ప్రవర్తన ఎలా ఉండాలి అని ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఇక్కడే మీటింగ్ పెట్టమని చెప్పాను:అందుకే అందర్నీ ఇక్కడికే రమ్మన్నా :

– ఒక అక్రమ నిర్మాణంలో కూర్చొని, పర్యావరణ చట్టాలు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, నదీ పరిరక్షణ చట్టాలు అన్నీకూడా ప్రభుత్వమే దగ్గరుండి బేఖాతర్ చేయాల్సిన పరిస్థితులు:ఇలాంటి పరిస్థితుల్లో మనం ఉన్నామని మనం తెలుసుకోవాలి:ఎవరైనా చిన్నవాళ్లు ఇదే పనిచేసి ఉంటే, మనం ఏం చేసేవాళ్లం?: అక్రమ నిర్మాణం ఎందుకు కడుతున్నారని అడిగేవాళ్లం: ఎవరైనా బలహీనులు ఈ పనిచేస్తే.. మనం అక్కడకు వెళ్లి ఆ నిర్మాణాన్ని తొలగిస్తాం:కాని మనమే ముఖ్యమంత్రి స్థాయిల్లో ఉండి, రూల్స్‌ను, నియమాలను ఉల్లంఘిస్తున్నాం:మనమే ఈ స్థాయిలో నియమాలను, నిబంధలను ఉల్లంఘిస్తే.. కిందిస్థాయిలో ఎటువంటి మెసేజ్ పంపుతున్నాం. ప్రతి ఒక్కరూ అంతరాత్మను ప్రశ్నించుకోవాలి:మనం సరైన మార్గంలో ఉన్నామా అని?:

– వ్యవస్థ ఏ స్థాయిలో దిగజారిపోయిందో మనం అంతా గుర్తించాలి కాబట్టే.. నాతో సహా అందర్నీ ఇక్కడకు రమ్మన్నా:మనం ఎలాంటి వ్యవస్థలో బతుకుతున్నామో మనం చూడాలి:ఈ హాలు నుంచే మనం ఆదేశాలు ఇస్తున్నాం: ఈ హాలులో ఇదే చివరి మీటింగ్ అని చెప్తున్నాం: మొదటి అక్రమ నిర్మాణం కూల్చివేత ఇక్కడితో ప్రారంభం కావాలి:మనం ఒక ఆదర్శంగా నిలిచిపోవాలి: మీమీ జిల్లాల్లోకి మీరు వెళ్లినప్పుడు.. పరిశీలన చేయండి:

–నాకు ఒక లెటర్ వచ్చింది.చంద్రగిరి ఎస్వీవీ నర్సింగ్ కాలేజీలో అక్రమాలు జరుగుతున్నాయని:నాలుగేళ్ల కోర్సుకు ఇద్దరే ఫ్యాకల్టీ అట:భవనాలు

అన్నీకూడా అక్రమ నిర్మాణాలేనట...సరిగ్గా ఉన్నాయా? లేదా? అని ఎవరైనా చూశారా? అక్రమం ఏదైనా జరిగితే.. దాన్ని కూల్చేయండి: ప్రభుత్వం అంటే పారదర్శకతకు ప్రతిరూమని చెప్పండి:

– చట్టం, న్యాయం, రాజ్యాంగాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు: 23 మంది ఎమ్మెల్యేలను తప్పు అని తెలిసినా కొంటారు: అనర్హత వేటు వేయాలని చెప్పినా చేయలేదు:అందులో 4 గురిని మంత్రులను చేశారు:ఇదే ఐఏఎస్‌ల మీద వారికి అధికారాలు ఛలాయించాలని అధికారాలు ఇచ్చారు:ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు: ఇలాంటి మీరు ఎన్నికలను నిష్పక్షపాతంగా ఎలా నిర్వహిస్తారు: కౌన్సిలర్లను ఎత్తుకుపోతారు? :కట్టడిచేయాల్సిన మీరు, పై స్థాయిలో ఉన్న వ్యక్తులే అలా ఉంటే.. ఎలా కట్టడి చేయగలరు?:మనం కచ్చితంగా మార్చాలి:ప్రభుత్వం అంటే.. గౌరవం పెరగాలి:ప్రభుత్వ ఉద్యోగులు అంటే అభిమానం పెరగాలి.

------------------